సాక్షి
నారాయణపేట

శుక్రవారం । 13 । జనవరి । 2023



ముగిసిన శిక్షణ

ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ టై అండ్ డై శిక్షణ ముగిసింది.

వివరాలు వివరాలు IIలో ▸



ముందస్తు వేడుకలు

సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలను జిల్లాలోని పలుపాఠశాలల్లో నిర్వహించారు.

వివరాలు IIIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

32.1 /16.0

రోజంతా ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరుగుతుంది. రాత్రికి మంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

అక్రమాలకు చెక్..!

ఉపాధి హామీ కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ లింక్ అమలు



మద్దూరు మండలంలోని దోరేపల్లి శివారులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- అనుసంధానమైతేనే నగదు చెల్లింపు
- ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా పర్యవేక్షణ

మద్దూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇప్పటివరకు వేలిముద్రతో కూలీల వేతనాలు చెల్లించగా, ఇక నుంచి జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసి, కూలీల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. తద్వారా డబుల్ జాబ్‌కార్డులను ఏరివేయడంతో పాటు పనుల్లో అక్రమాలకు పూర్తిగా చెక్ పెట్టనున్నారు.

ముమ్మరంగా అనుసంధానం..

జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్‌అసిస్టెంట్ల సహాయంతో ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆపరేటర్లు జాబ్‌కార్డులకు ఆధార్ లింక్ చేస్తున్నారు. జిల్లాలో 13 మండలాల్లోని 280 జీపీల్లో 1,07,029 జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 2,18,475 మంది కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టివ్‌గా 1,43,578 మంది కూలీలు ఉన్నారు. ఇందులో ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో 1,41,518 కూలీల ఆధార్ లింక్ చేసినట్లు అధికారులు తెలిపారు. యాక్టివ్ ఉన్న కూలీల్లో 2,060 మంది మాత్రమే ఆధార్ లింక్ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 98.6శాతం యాక్టివ్ కూలీలను అనుసంధానం చేసినట్లు తెలిపారు.

సాంకేతిక సమస్యతో ఇబ్బంది..

కూలీల హాజరు నమోదు చేయడానికి ఫీల్డ్ అసిస్టెంట్లకు తంటాలు తప్పడంలేదు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (ఎన్ఎంఎంఎస్) యాప్ ద్వారా కూలీల వివరాలు ప్రతిరోజూ పని ప్రదేశంలో జీపీఎస్ ఆధారంగా నమోదు చేయాల్సి ఉంటుంది. మొదట ఉదయం ఫొటోలను అప్‌లోడ్ చేసిన తర్వాత నాలుగు గంటల తర్వాత మరోమారు ఫొటోలు, పని వివరాలు అప్‌లోడ్ చేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య, సర్వర్‌డౌన్‌గా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగటం లేదు. ఆధార్ అనుసంధానంలోనూ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఎఫ్ఏలు చెబుతున్నారు. ఈ లింక్‌లో కూడా ఆధార్‌కార్డులో ఓ రకంగా, జాబ్‌కార్డులో మరో రకంగా పేర్లు, స్పెల్లింగులు, చిరునామాలు ఉండటంతో లింకప్ సమస్య ఉందని తెలుస్తోంది.



జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు	
మండలాలు	13
గ్రామాలు	280
జాబ్‌కార్డుల సంఖ్య	1,07,029
కూలీల సంఖ్య	2,18,475
యాక్టివ్‌గా ఉన్న కూలీలు	1,43,578
ఆధార్ లింకు అయిన కూలీలు	1,41,518

దాదాపు పూర్తయింది..



జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న కూలీల ఆధార్ లింక్ దాదాపుగా పూర్తయింది. మిగిలినది ఈనెల 20వ తేదీ వరకు పూర్తి చేస్తాం. మిగితా వారికి జాబ్‌కార్డులను కూడా ఆధార్ లింక్ చేయడానికి కార్యాచరణ రూపొందించాం. జాబ్‌కార్డు ఉన్న వారు మీ కార్యదర్శులకు గానీ, ఫీల్డ్‌అసిస్టెంట్లతో గాని ఆధార్‌లింక్ కోసం సంప్రదించాలి.

– గోపాల్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- వీసీలో వివరించిన కలెక్టర్ శ్రీహర్ష
- జిల్లాలో 24 వైద్యబృందాలు ఏర్పాటు

నారాయణపేట: కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్రీహర్ష వీసీలో వివరించారు. గురువారం సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జనవరి 18న ఒంటిగంటకు అన్ని జిల్లాలో ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కలెక్టర్లకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 24 వైద్య బృందాలు ఏర్పాటు చేసి తగిన అవగాహన కల్పించడం, యంత్రాలు సమకూర్చుకోవడం జరిగిందన్నారు. వైద్యశిబిరాలకు అవసరమైన టెంట్లు, టేబుళ్ల తాగునీరు తదితర ఏర్పాట్లకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దిగువ స్థాయి సిబ్బందికి అవసరమైన ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేస్తామన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తగిన అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాకు ఇప్పటివరకు వచ్చిన కంటిఅద్దాలు ఆయా మండలాలకు సరఫరా చేయించమని తెలిపారు. జూమ్ మీటింగ్‌లో సెక్రటేరియట్ నుంచి వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, కమిషనర్ శ్వేతామహంతి, హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా నుంచి అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాంమనోహర్‌రావు, డీపీఓ మురళి తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణం ఆకస్మిక తనిఖీ

మక్తల్: మక్తల్ పట్టణంలో రేషన్ షాపులను అదనపు కలెక్టర్ పద్మజారాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటో నంబర్ కేంద్రంలో స్టాక్‌ను, బోర్డుల ఏర్పాటును పరిశీలించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చందపూర్ గ్రామంలో రైస్‌మిల్ వద్ద హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్ఓ దయాకర్‌రావు, శివప్రసాద్‌రెడ్డి, డీఎం హతిరాంనాయక్, డీటీ గురురాజరావు, కల్వ శ్రీనివాసులు, బిలకంటి నర్సయ్య, ఉదయ్‌కుమార్, తిమ్మన్న, నరహరి పాల్గొన్నారు.



మక్తల్‌లో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ పద్మజారాణి

జిల్లాస్థాయి కబడ్డీ విజేత మరికల్

మరికల్: మండల కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలో మరికల్ విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు సాగిన ఈ పోటీలో 13 జట్లు తలపడ్డాయి. గురువారం జరిగిన తుది పోరులో నర్వ, మరికల్ జట్లు తలపడగా మరికల్ జట్టు విజేతగా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడారు. గ్రామీణ యువత క్రీడల్లో ప్రతిభ చూపుతుంటారని, అలాంటి వారిన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, నగదు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రతంగపాండురెడ్డి, రవికిరణ్, గోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేతకు అభినందనలు

ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన నారాయణపేట జిల్లా కబడ్డీ జట్టును రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతకుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురువారం మరికల్‌లో ఆ క్రీడాకారులకు ప్రత్యేక క్రీడాదుస్తులను అందజేసి సన్మానించారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న శాంతకుమార్

ఇళ్లకు హాస్టల్ విద్యార్థులు





ధన్వాడ: పాఠశాలలకు 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి విద్యార్థులు హాస్టళ్ల నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. స్థానిక కస్తూర్బా పాఠశాల వద్ద తల్లితండ్రులు వచ్చి విద్యార్థులను తీసుకువెళ్లడం కనిపించింది.

పెద్ద చెరువు నీటి విడుదల

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్దచెరువు తూము నుంచి సర్పంచ్ అమరేందర్‌రెడ్డి గురువారం పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. దాదాపు 200 ఎకరాలకు పారనుందని తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులను సంప్రదించి తైబందీ చేసినట్లు చెప్పారు. ఆర్ఐ మల్లేష్, ఇరిగేషన్ ఏఈ సదానంద, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిములు, కొండప్ప, బుడ్డప్ప, సుధాకర్‌రెడ్డి, కథలప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



తూము నుంచి నీటిని విడుదల చేస్తున్న సర్పంచ్ అమరేందర్‌రెడ్డి

'ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి'

నారాయణపేట రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రజలు ఇల్లు తాళంవేసి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. విలువైన వస్తువులను బీరువాలో, వాహన డిక్కీల్లో ఉంచరాదని, పక్కలో ఉండే ఇరుగు, పొరుగు వారికి ఇల్లు గమనించమని చెప్పాలని, బీరువా తాళాలు ఇంట్లో ఉంచరాదని సూచించారు. అనుమానిత వ్యక్తులు ఉంటే ఆయా కాలనీల ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు.

న్యాయసేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి జి.శ్రీనివాస్

నారాయణపేట రూరల్: కోర్టులో కేసుల వాదనకు సొంతంగా లాయర్‌ను పెట్టుకోలేని వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి జి.శ్రీనివాస్ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. చిన్నవయస్సులో తెలియక తప్పులు చేసి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, వ్యసనాలకు బానిస కావడంతోనే నేరప్రవృత్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన విషయాలను శ్రద్ధగా వింటూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పేదలు న్యాయం కోసం కోర్టుకు వెళ్లే సమయంలో లాయర్‌ను సొంతంగా పెట్టుకోలేని పరిస్థితి ఉంటే, వారికి న్యాయ సేవాధికార సంస్థ సహకారం అందిస్తుందన్నారు. ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని, ఇంట్లో తల్లిదండ్రులకు గ్రామాల్లోని బీదవారికి చేరవేయాలన్నారు. పోక్సో యాక్ట్, మహిళా, బాలకార్మిక చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘువీర్‌యాదవ్, నందునామాజి, వినోద్, హెచ్ఎం నాజ్మిన్, టీచర్లు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానందుడు



జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: స్వామి వివేకానందుడు యువతకు ఎంతో స్ఫూర్తి ప్రదాతని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకుపోవాలని, క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవం, జాతీయతా భావం కలిగి ఉండాలని అన్నారు. రామకృష్ణ మఠం ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ కృష్ణయ్య, విజయ్, శంకర్‌లాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్‌లోని స్వామి వివేకానందుడి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. గురువారం యువజన దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలని, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లకు తగ్గట్లు కష్టపడి ఉద్యోగాలను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్‌భట్టడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కన్న జగదీశ్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌సాగర్, వేపూరి రాములు, నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మక్తల్: వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి తదితరులు

పోలీసుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

నారాయణపేట రూరల్: జిల్లాలోని పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ స్థాయి కంటే తక్కువ ర్యాంకు కల్గిన పోలీసు ఉద్యోగుల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందని డీఈఓ గోవిందరాజు తెలిపారు. పోలీసుల పిల్లలు 9, 10వ తరగతి చదువుతుంటే వారు ఫిబ్రవరి 5లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆ కాపీని స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. మూడేళ్ల వరకు రూ.20వేలు అందిస్తారని తెలిపారు.



న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.5,921

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,921, కనిష్టంగా రూ.4,951 పలికింది. వడ్లు హంస గరిష్టంగా రూ.2,035, కనిష్టంగా రూ.1,990, వడ్లు సోనా గరిష్టంగా రూ.2,420, కనిష్టంగా రూ.1,940, ఎర్ర కందులు గరిష్టంగా రూ.8,211, కనిష్టంగా రూ.7,060, తెల్లకందులు గరిష్టంగా రూ.8,360, కనిష్టంగా రూ.7,500 పలికాయి. జిల్లాలోని కాటన్ మిల్లులో పత్తి క్వింటాల్ గరిష్టంగా రూ.8,200, కనిష్టంగా రూ.5వేలు పలికింది.

'మన ఇసుక' సద్వినియోగం చేసుకోండి

నారాయణపేట: జిల్లా పరిధిలో గృహ నిర్మాణాలు చేపట్టే యజమానులు మన ఇసుక వాహనం వెబ్‌సైట్ ద్వారా కోస్గి మండలంలోని వాగు నుంచి ఇసుకను బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక కోసం ఆన్‌లైన్ https://tsmiv.cgg.gov.in ద్వారా బుక్ చేసుకుంటే అదేరోజు లేదా మరుసటి రోజు సరఫరా చేస్తారని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని పలు మైనార్టీ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ అధ్యక్షురాలు బి.కుసుమ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల బాలుర-1లో పీజీటీ ఇంగ్లిష్, మహబూబ్‌నగర్‌లోని బాలికల-3 గురుకులంలో పీజీటీ ఇంగ్లిష్, దేవరకద్ర బాలుర-1లో స్టాఫ్ నర్స్ (మేల్) ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీచింగ్ పోస్టులకు ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేట్‌తో పాటు బీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలని, స్టాఫ్ నర్స్ పోస్టు కోసం జీఎన్ఎం లేదా బీఎస్సీ (నర్సింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆయా సంబంధిత ప్రిన్సిపాళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 9866123315, 8341147930 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న ప్రకటనలో తెలిపారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గతంలో శిక్షణ పొందిన వారు ఇప్పుడు అర్హులు కాదని తెలిపారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి: బండి సంజయ్



కొల్లాపూర్: తెలంగాణ ఏర్పాటు లక్ష్యం, ఆశయం నెరవేరాలంటే ఒక్కసారి ప్రజలు బీజేపీకి అవకాశం ఇవ్వాలని, తద్వారా రాష్ట్రంలో రామ రాజ్యం, కాషాయ రాజ్యాన్ని స్థాపిద్దామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రగతి కోసం పాదయాత్ర గురువారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక రాజబంగ్లా ఎదుట నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని స్వామివివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్‌షోగా సభా వేదికవద్దకు చేరుకున్నారు. సభలో ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా కేసీఆర్ మాత్రం వంద గదులతో ప్రగతి భవన్ నిర్మించుకున్నారన్నారు. బీజేపీ పోరాటాల వల్లే ప్రగతి భవన్‌ను వీడి ప్రజలకు మధ్యకు వస్తున్నారన్నారు. పేదల దృష్టి మరల్చేందుకు, అభివృద్ధిపై చర్చ జరగకుండా ఉండేందుకే బీఆర్ఎస్‌ను స్థాపించారన్నారు. సర్పంచ్‌లకు కేంద్రం మంజూరు చేసిన నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లించిందని, ఫలితంగా స్థానిక ప్రజాప్రతినిధులు అప్పుల పాలయ్యారన్నారు. సర్పంచ్‌లకు మిత్తీతో సహా దారి మళ్లించిన నిధులు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. మేం లేఖ రాస్తేనే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని, సుధాకర్‌రావు కృషి వల్లే సోమశిల బ్రిడ్జి, జాతీయ రహదారి మంజూరైందన్నారు. కొత్తగా జోగుళాంబ నుంచి కొల్లాపూర్ మీదుగా మరో రహదారి, కొల్లాపూర్‌కు రైల్వేలైన్ కావాలంటున్నారని, ఆయన పట్టుపడితే సాధిస్తారని ప్రశంసించారు.

ముగిసిన టై అండ్ డై శిక్షణ



శిక్షణలో చీరకు రంగులు వేసిన మహిళలు

- 15రోజులుగా శిక్షణ పొందిన 30మంది మహిళలు
- సహకారం అందించిన నాబార్డు



దుస్తులకు రంగులు వేయటం నేర్పిస్తున్న శిక్షకుడు

జడ్చర్ల టౌన్: నాబార్డు సహకారంతో స్థానిక ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్ మహిళా సమాఖ్య భవనంలో 15రోజులుగా ఇస్తున్న టై అండ్ డై శిక్షణ గురువారంతో ముగిసింది. మొత్తం 30మంది మహిళలు ఉచితంగా శిక్షణ పొందారు. జర్దోసి, మగ్గం వర్క్‌లపై అవగాహన ఉన్న మహిళలకు టై అండ్ డై శిక్షణ ఇవ్వటంతో స్వయం ఉపాధికి మంచి మార్గం అవుతుందని అభిప్రాయ పడుతున్నారు. చీరలకు రంగులు అద్దటం వినటమే తప్ప తాము ఎప్పుడూ చూడలేదని ఇదో కొత్త అనుభూతిని కలిగిస్తుందని మహిళలు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు ఇవ్వటంతో వారికి బ్యాంకు రుణాలు సులువుగా లభించేందుకు మార్గం ఏర్పడినట్లయ్యింది. శిబిరం ప్రారంభం సందర్భంగా నాబార్డు ఏజీఎం, లీడ్‌బ్యాంక్ మేనేజర్లు సైతం శిక్షణ తర్వాత అవసరమైన రుణాలు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నామని ప్రకటించటంతో మహిళాసాధికారికతకు కారణం కానుంది. శిక్షకుడు నర్సింహులు 15రోజులుగా మహిళలకు చీరలు, చున్నీలు, డ్రస్‌మెటీరియల్స్ వంటి వాటికి రంగులు ఎలా అద్దాలో ప్రదర్శనల ద్వారా నేర్పించారు. అలాగే రోలింగ్, ఫినిషింగ్ లోనూ తర్ఫీదు ఇచ్చారు. రంగులు అద్దిన చీరలు చివరి రోజున ప్రదర్శనలో ఉంచారు. శిక్షణ కాలంలో ఒక్కో మహిళకు రూ.750స్టైఫండ్ అందించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

రెండో బ్యాచ్ ప్రారంభిస్తాం



నాబార్డు సహకారంతో శిక్షణ రెండో బ్యాచ్‌ను త్వరలో ప్రారంభిస్తాం. మొదటి బ్యాచ్‌కు ఊహించని స్పందన వచ్చింది. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావటానికి మా అసోసియేషన్ చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే ఉచిత శిక్షణ ఇచ్చాము. శిక్షణ పొందిన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు మా వంతు కృషి చేస్తాం.

– గోవర్ధని, నిర్వాహకురాలు

శిక్షణ ఎంతో ఉపయోగం



టై అండ్ డై శిక్షణ ఎంతో ఉపయోగంగా ఉంది. జీవితంలో ఆర్థికంగా స్థిరపడటానికి నాకు మార్గం దొరికింది. ఇన్నాళ్లు టైలరింగ్, జర్దోసి, మగ్గం వర్క్ గురించి మాత్రమే తెలుసు. ఇలా రంగులు అద్దటం కొత్తగా ఉంది. నాలాంటి మహిళలకు శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయి. ఇంట్లోనే ఉండి పనిచేసుకోవచ్చు.

– పల్లవి, నిమ్మబావిగడ్డ, బాదేపల్లి పట్టణం

కొత్త అనుభూతి



చీరలు, ఇతర దుస్తులకు రంగులు అద్దటం టైఅండ్‌డై కొత్త అనుభూతిని కలిగించింది. హైదరాబాద్‌లాంటి నగరాల్లోనే ఇలాంటి శిక్షణ ఇస్తుంటారు. నేను ఇంతకుముందు ఎన్నోసార్లు ఇక్కడ శిక్షణ ఇస్తారేమోనని చూశాను. ఇప్పటికి నా కల నెరవేరింది. శిక్షణ పొందిన వాళ్లం గ్రూపుగా ఏర్పడి కలిసి పనిచేస్తాం.

– శ్రీవాణి, శాంతినగర్, బాదేపల్లి పట్టణం

ఇప్పుడే వింటున్నా..



టైఅండ్‌డై అనే పదం శిక్షణకు వచ్చాకే విన్నాను. రోజు రోజుకు ఎంతో శ్రద్ధ పెరిగింది. రంగులు అద్దటం చూశాక నాలో కొత్త ఉత్సాహం వచ్చింది. టై అండ్ డై ద్వారా ఉపాధి కల్పించుకునేందుకు ప్రయత్నిస్తాను. నాలాగే మరింత మందికి శిక్షణ ఇవ్వటం వల్ల ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.

–సమీరాబేగం, బాదేపల్లి పట్టణం

క్లుప్తంగా

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

బల్మూర్: భర్త, అత్త వేధింపులు తాళలేక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శివానందంగౌడ్, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాణాలకు చెందిన మాయిని తిరుపతయ్యకు వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్ చెందిన శిరీష(21)తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆరు నెలల కిత్రం వీరికి పాప పుట్టింది. భర్తతో పాటు అత్త లక్ష్మమ్మ పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలని తరుచూ వేధిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం శిరీషను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి తల్లి జంగమ్మకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నాగర్ కర్నూల్ తలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కూతురిని నిత్యం కట్నం కోసం వేధిస్తుండటంతో ఫోన్‌చేసి బాధపడేదని, పండుగకు ఇంటికి తీసుకెళ్దామనే లోపే వారి వేధింపులు అధికమై ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి జంగమ్మ కన్నీటి పర్యంతమైంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

జడ్చర్ల: స్థానిక శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన కుమార్(32) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్ల క్రితం ఆయన భార్య విడిచి వెళ్లిన తర్వాత తల్లి భీమమ్మతో కలిసి ఉంటున్నాడు. భార్య కాపురానికి రాకపోవడం, ఇతర కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



తుడు చింతల బాలయ్య (ఫైల్)

మన్ననూర్: అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ గ్రామానికి చెందిన చింతల బాలయ్య(45) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు కుటుంబ అవసరాలకు డబ్బులు లేక మానసికంగా కుంగిపోతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆరు బయట నుంచి ఇంటి తలుపులు మూసేసి ఇంటి ముందున్న సపారం (మచ్చు)కు ఉరేసుకున్నాడు. సమీప వ్యక్తులు గమనించి ఇంటి తలుపులకు ఉన్న గడియ తీసి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. కిందికి దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య కృష్ణమ్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాలిక మృతిపై కేసు నమోదు

గట్టు: తుమ్మలచెరువులో విద్యుతాఘాతంతో ప్రియాంక(9)మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. తుమ్మలచెరువు సమీపంలో శేఖర్‌రెడ్డి పొలం వద్ద కాల్వ కోసం తవ్విన మట్టి కుప్పల్లో ఆడుకుంటూ విద్యుత్ తీగలు తాకడంతో బాలిక మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహానికి గద్వాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలు ఇలా.. ఇటిక్యాల మండలంలోని వేముల స్టేజీ సమీపంలో గల ప్రియదర్శిని రెస్టారెంట్ వద్ద కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తి(45)ని ఢీకొట్టి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శరీరం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. ప్రస్తుతం మృతదేహం అలంపూర్ ఆస్పత్రిలో ఉందని ఆచూకీ తెలిసిన వారు 9440904768 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష

దేవరకద్ర: మద్యం తాగి లారీని నడిపిన డ్రైవర్‌కు ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానాను కోర్టు విధించిందని ఎస్ఐ భగవంతరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన మధు (35) మద్యం తాగి లారీని నడిపిస్తున్నట్లు గుర్తించి పరీక్షించినట్లు తెలిపారు. గురువారం ఉదయం లారీ డ్రైవర్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష ఖరారైందని తెలిపారు.

అలవి వలల పట్టివేత

కొల్లాపూర్: అమరగిరి సమీపంలోని కృష్ణానదిలో అలవి వలలను పట్టుకున్నట్లు ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మత్స్యశాఖ అధికారులతో కలిసి నదితీర ప్రాంతాల్లో తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అలవి వలలను స్వాధీనం చేసుకుని, మత్స్యశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు మిద్దెరాజు, పలువురు కూలీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా

- ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన బస్సు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులో బుధవారం అర్ధరాత్రి హైవేపై ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తాపడింది. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూర్‌కు చెందిన జీపీ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఎండీ.రిజ్వాన్ బుధవారం రాత్రి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు బయలు దేరాడు. మార్గమధ్యలో సంకలమద్ది శివారులోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి తర్వాత ముందు వెళ్తున్న డీసీఎం దాని ముందు వెళ్తున్న మిని బొలెరోను ఢీకొట్టడంతో బొలెరో రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. తర్వాత డీసీఎంను బస్సు ఓవర్ టేక్ చేయబోతుండగా డీసీఎం తగలడంతో బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. అదే వైపు బస్సులోని లగేజీలో పెద్ద ఎత్తున ఇనుప సామగ్రి ఉండటంతో బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈక్రమంలో బస్సులో ఉన్న 30 మందిలో ముగ్గురికి గాయాలయ్యాయి. మిగిలిన వారిలో కొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బస్సు ముందు అద్దాలు ధ్వంసం కావడంతో పాటు పక్కన ఉన్న కిటికీల అద్దాలు పగిలిపోయాయి. బోల్తా పడిన బస్సులో నుంచి ప్రయాణికులు అతికష్టం మీద బయటకు వచ్చారు. బస్సు క్లీనర్ ఎండీ.ఖాసీం, బెంగళూర్‌కు చెందిన సానిక్ బిస్వాస్, దివ్యకరుణాకరన్‌లకు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు వేర్వేరు వాహనాల్లో తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఎల్అండ్‌టీ సిబ్బంది బస్సును ప్రమాద స్థలం నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఓవర్‌లోడ్ లగేజీ కారణం

హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు వెళ్తున్న ట్రావెల్ బస్సులో ఓవర్‌లోడ్ లగేజీ ఉంది. బస్సుకు ఎడమ వైపు ఉన్న లగేజ్ బాక్స్‌లో బరువైన ఇనుప నట్లు, బోల్టులతో పాటు ఇతర సామగ్రి ఉన్నాయి. డీసీఎం బస్సుకు తగిలినప్పుడు బస్సు ఎడమ వైపు రోడ్డు కిందకు దిగి కొంత దూరం వరకు వెళ్లింది. ఈక్రమంలో బస్సులో ఉన్న లగేజీ మూలంగా బస్సు అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడినట్లు తెలుస్తుంది.

డ్రమ్‌సీడర్‌తో అధిక లాభాలు



డ్రమ్‌సీడర్ పరికరంతో వరి విత్తనాలు నాటుతుండగా పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

- వ్యవసాయ స్పెషల్ కమిషనర్ హన్మంతు

భూత్పూర్: డ్రమ్ సీడర్‌తో వరి నాటితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ స్పెషల్ కమిషనర్ హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని కర్వెనలో వ్యవసాయ పొలంలో నిర్వహించిన క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, డ్రమ్ సీడర్ ప్రాజెక్టు స్కాలర్ స్టీఫెన్‌తో కలిసి డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలను నాటుటను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కర్వెనలో రైతువేదికలో వ్యవసాయ స్పెషల్ కమిషనర్ మాట్లాడుతూ.. రైతులు ఎకరాకు 10 నుంచి 12 కిలోలు వరి విత్తనాలు సరిపోతాయని, సాళ్ల మధ్య దూరం ఎక్కువ ఉండటంతో గాలి వెలుతురు వల్ల చీడపీడలు తగ్గుతాయన్నారు. గ్రామంలో 12 మంది రైతులు డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగుకు ముందుకు రావడంతో మండల వ్యవసాయాధికారులను ప్రశంసించారు. ఆయిల్‌ఫామ్ సాగును కూడా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, ఏఈవో హన్మంతు, కోఆర్డినేటర్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

కానాయపల్లి నిర్వాసితులకు న్యాయం చేయాలి



దీక్షలో కూర్చున్న రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట: ముంపు గ్రామం కానాయపల్లి నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని కానాయపల్లి నిర్వాసితుల సమస్యలపై గురువారం కొత్తకోట చౌరస్తాలో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకరసముద్ర రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో కక్కుర్తి పడుతున్నాడని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 9ఏళ్లు గడుస్తున్నా రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 2018 మే 7న బీసీ సంఘం ఆధ్వర్యంలో కానాయపల్లి టు కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపడితే 3నెలల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. ఈ దీక్షను అఖిలపక్షం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ప్రారంభించారు. నిర్వేన్ సర్పంచ్ విశ్వనాథం, బీజేపీ నాయకులు సాయిరాం, కాంగ్రెస్ నాయకులు మహేష్ సంఘీభావం తెలిపారు. దీక్షలో బీసీ నాయకులు అంజన్నయాదవ్, అరవిందాచారి, మహిందర్‌నాయుడు, శేఖర్‌గౌడ్, స్వామి, సత్యనారాయణ, మల్లేష్, మేఘనాథ్‌గౌడ్, ప్రవీణ్, లక్ష్మీనరసింహ, బాలరాజు, నిర్వాసితులు శ్రీనువాస్, శివకృష్ణ, నరేష్, వెంకటయ్య కూర్చున్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి



రక్తదానం చేస్తున్న యువకులు

- డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: ఈ తరం యువత ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని చేరుకోవడానికి కష్టపడాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సాహించడమన్నారు. టెక్నాలజీని సక్రమంగా ఉపయోగించి ఉన్నతికి వాడుకోవాలన్నారు. శిబిరంలో పట్టణానికి చెందిన 173మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ రాములు, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యాముల్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

జాతీయ యువజన దినోత్సవాల్లో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి పరేడ్ మైదానంలో డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ బహుమతులు అందించారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల నుంచి గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

బల్మూర్: మండలంలోని బాణాలలో గురువారం పూరి గుడిసె కాలి బూడిదైంది. సర్పంచ్ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లమ్మ పూరి గుడిసె ముందున్న వరిగడ్డి విద్యుదాఘాతంతో నిప్పంటుకుంది. దీంతో పూరి గుడిసెకు మంటలు వ్యాప్తించాయి. అచ్చంపేట ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో గుడిసెలో ఉన్న రూ.4వేల నగదు, బియ్యం, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు ఆస్తినష్టం అయినట్లు సర్పంచ్ తెలిపారు.

కేఎల్ఐ కాల్వలకు గండ్లు

కోడేరు: మండల కేంద్రం శివారులో ఉన్న కేఎల్ఐ మైనర్–1, సబ్–1 కాల్వలకు రెండు చోట్ల గండ్లు పడటంతో సాగునీరు వృథాగా పోతుంది. అధికారులు నామమాత్రంగా మరమ్మతు పనులు చేసి వదిలేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి గండ్లు పడిన చోట మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు. గండ్లు పడటంతో ఇతర గ్రామాలకు సాగునీరు నిలిచిపోయింది. గండ్లు పడిన చోట కొందరు రైతులు తాత్కాలికంగా మరమ్మతు చేసుకున్నారు.



ఆధునిక వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని, ప్రధానంగా యంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలని పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన రైతులకు వ్యవసాయంలో మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా పాటించాల్సిన పద్ధతులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం యాంత్రీకరణపై మండలంలోని బోయాపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో వివరించారు. గ్రామంలో డ్రోన్ ద్వారా పిచికారి ఏవిధంగా చేయాలని, యాంత్రీకరణ వల్ల కలిగే లాభాలు, ఖర్చు, రాబడి వంటి అంశాలను వివరించారు. వాతావరణ మార్పుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోతాయని, అలాంటి కాకుండా ముందస్తుగా మార్పులను ఎలా పసిగట్టాలో తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ ప్రాజెక్ట్ శాస్త్రవేత్తలు దివ్యారాణి, శంకర్, మాధురి, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త సుజాత, మమత, స్రవంతి, బోయాపూర్ సర్పంచ్ రాఘవులు, ఏఈఓ శారద పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గేటు, కంచె ఏర్పాటు

- సర్పంచ్ ఫిర్యాదుతో తొలగింపు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన గేటును తొలగించిన పంచాయతీ సిబ్బంది

బాలానగర్: మండలంలోని బోడజానంపేట్ రెవెన్యూ పంచాయతీలోని సర్వే నెంబర్ 83 పలుగుమీదితండా పంచాయతీలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా కురిసిన అతి వర్షాలతో మొక్కలకు నీరు పోయాల్సిన అవసరం లేకపోవడంతో పాలకమండలి సభ్యులు అటువైపుగా చూడలేదు. దీంతో పక్కనే ఉన్న పరిశ్రమకు చెందిన వ్యక్తులు సుమారు 3 ఎకరాల భూమిలో అక్రమంగా కంచె ఏర్పాటు చేయడంతోపాటు పల్లె ప్రకృతివనంలోకి కూడా వెళ్లేందుకు వీల్లేకుండా గేటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని సర్పంచ్ మంజుల, ఉప సర్పంచ్ శివ, వార్డు సభ్యులు నాలుగు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్న ప్రభుత్వ భూమిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. దీంతో స్పందించిన తహసీల్దార్ బుధవారం ఆర్ఐ వెంకట్ రెడ్డి, ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు సైతం ఏర్పాటు చేయించారు. వెంటనే గేటును తొలగించాలని సర్పంచ్‌కు ఆదేశించారు. దీంతో గురువారం సర్పంచ్ భర్త రాంబాబు, ఉప సర్పంచ్, సభ్యులు గేటును జేసీబీ సాయంతో తొలగించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా అక్రమంగా పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు వీలు లేకుండా గేటు ఏర్పాటు చేశారన్నారు. క్రీడా ప్రాంగణం కోసం ప్రభుత్వ స్థలం గుర్తించే క్రమంలో అక్కడకు వచ్చిన తమకు ప్రైవేట్ పరిశ్రమ వ్యక్తులు కబ్జా చేశారని తెలిసిందని అన్నారు. అంతేకాకుండా తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమిలో నుంచి పోవడానికి వీలు లేదని పరిశ్రమ వ్యక్తులను ప్రశ్నించగా తమను పోలీసులతో వేధిస్తున్నారని వాపోయారు.

- సంఘటనపై పరిశ్రమ ప్రతినిధి వంశీ మాట్లాడుతూ.. తాము ఇంతకు ముందు భూమి అమ్మిన వ్యక్తులే కంచె, గేటు ఏర్పాటు చేసి ఇచ్చారని తెలిపారు. ఏడీ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నామని ప్రభుత్వ భూమి అయితే తమకు అవసరం లేదని అన్నారు. సర్వే అనంతరం తమ భూమి చుట్టు కంచె ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. తమ కంపెనీకి దారి కోసం కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు.
- ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందిన వెంటనే ఆర్ఐ, సర్వేయర్‌తో ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమ వ్యక్తుల కోరిక మేరకు ఏడీ సర్వే అనంతరం ప్రభుత్వ భూమిలో తెలంగాణ క్రీడాప్రాంగణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

తమ్ముడి పరిస్థితి విషమం

జడ్చర్ల: పట్టణ శివారులోని కావేరమ్మపేట ప్రభుత్వ అతిథి గృహం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన ప్రశాంత్(28), విష్ణు అన్నదమ్ములు గురువారం బైక్‌పై హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వస్తున్నారు. కావేరమ్మపేట ప్రభుత్వ అతిథి గృహం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ అకస్మికంగా బ్రేక్ వేయడంతో వెనుక వైపు నుంచి వీరు ఢీకొన్నారు. బైక్‌పై ఉన్న ఇద్దరు సోదరులు తీవ్రంగ గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రశాంత్ మృతి చెందాడు. తమ్ముడు విష్ణు పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొని వ్యక్తి దుర్మరణం

బాలానగర్ (రాజాపూర్): ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి రాజాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. రాజాపూర్ చెందిన నర్సింహులుగౌడ్ (45) బాలానగర్ వైపు నుంచి జడ్చర్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను స్కూటీతో ఢీకొన్నాడు. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

We are Hiring!
• Accountants • HR Manager
• Cashier • Sales Excutive
• System Operator • Service Incharge
• Floor Incharge • Service Advisor
• Technician
Apply Now !
Cell : 8498078111
Walk -in interviews : Morning 10:30 AM to 6 PM
Venue:- Elan Honda Yenugonda, Mahabubnagar
MAHABUBNAGAR, NAGAR KURNOOL, MARIKAL

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE
గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569.

SERVICES
బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019.

BUSINESS OFFER
LIC నూతన సంవత్సరములో సువర్ణావకాశం. LIC ఏజెంట్‌గా చేసుకున్న వారికి కమీషన్‌తో పాటు 5000/- రూపాయలు స్టైఫండ్ ఇవ్వబడును. జడ్చర్ల, షాద్‌నగర్. సంప్రదించండి: 7659066229.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక

క్లుప్తంగా

పట్టుదలతో లక్ష్య సాధన

మరికల్: పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని హెచ్ఎం లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కన్మనూర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌వీపీ ఇండియా, నిర్మాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కెరీర్ గైడెన్స్ సంబంధించిన బుక్స్, టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సిములు, వెంకట్‌రెడ్డి, శ్రీలత, హన్మంతు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లేష్, బస్వత్‌రెడ్డి, కళావతి పాల్గొన్నారు.

ఏడుగురు బాల కార్మికుల గుర్తింపు

మక్తల్: పట్టణంలో వివిధ దుకాణాల్లో పని చేస్తున్న ఏడు మంది బాలకార్మికులను గురువారం ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిచారు. దాడుల్లో ప్రభాకర్, శివ, శ్రావణి పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపు

నారాయణపేట రూరల్ : మక్తల్, ఊట్కూర్ మండలాల్లో ఆపరేషన్ స్మైల్ పోలీసు బృందాలు గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌షాప్, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న ఎనిమిది మంది బాలకార్మికులను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇస్తామని డీఎస్పీ తెలిపారు.

రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్‌కు సన్మానం

మక్తల్: రాష్ట్ర కాంగ్రెస్ ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను గురువారం హైదరాబాద్‌లో గాంధీభవనంలో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. పార్టీ స్థితిగతులను వివరించారు.

విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేత



ధన్వాడ: సేవ ఇంటర్నేషన్ సంస్థ వారు సంచార జాతులు (బుడగ జంగం) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యామందిర్ పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థి గణేష్‌కు స్కాలర్‌షిప్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కళయ్య విద్యార్థి తల్లితండ్రులకు గురువారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకాంత్, భరత్, సరిత, అంజలి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిట్ పరిషత్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం డీఈఓ గోవిందరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చక్కగా పని చేసి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాలన్నారు. పిల్లల్లో భాషా పరిజ్ఞానం పెంపొందించడంలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, రాములు, విభూషణ్, శ్రీనివాస్, వీరేందర్‌గౌడ్, రామ్మోహన్, సుదర్శన్, నర్సింహ, అజయ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



నారాయణపేట రూరల్ : పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం మెరుగవుతుందని బిజ్వార్ ఆదిత్య పరత్రి స్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పుస్తక స్టాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏదైన శుభ కార్యాలకు పుస్తకాలను బహూకరించాలన్నారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందుడి ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జ్ సుధామాధురి, నాయకులు గందె చంద్రకాంత్, హరినారాయణ్‌బట్టడ్, జయంత్‌రెడ్డి, రఘువీర్‌యాదవ్, రతంగ పాండురెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నక్క కిష్టప్ప, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి భావిభారత నిర్మాతలు

కోస్గి: నేటి బాలలే రేపటి భావిభారత నిర్మాతలని, విద్యార్థి దశ నుంచి ఉన్నతమైన లక్ష్యం ఏర్పరుచుకొని లక్ష్య సాధన కోసం కష్ట పడాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణా ఉన్నత పాఠశాలలో..



ఉజ్జెల్లిలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు



గజ్జరందొడ్డి పాఠశాలలో..

ఆదర్శప్రాయుడు వివేకానందుడు



మరికల్‌లో..



పెద్దకడ్మూర్‌లో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకనందుడని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. భారత జీవన సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మికవేత్త, యువతకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం యువత రక్తదానం చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో వివేకానంద సామాజిక సేవా సమితి రాష్ట్ర ప్రచారక్ కృష్ణస్వామి, జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, ఎస్ఐ అశోక్‌బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, ఎంపీపీ మధుకర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, హెచ్ఎంలు నర్సిములు, జ్యోతి, మణెమ్మ, నిజాముద్దీన్, సీఆర్పీ నర్సిములు తదితరులు పాల్గొన్నారు. –సాక్షి, నెట్‌వర్క్



మాధవరంలో..



గుండుమాల్‌లో..



మక్తల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో..



కోస్గిలో..



మద్దూరులో..



దామరగిద్దలో..

డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న కృష్ణయ్య

నారాయణపేట రూరల్: పోలీసు వాహనాలను నడిపించే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంటీఓ ఆర్ఐ కృష్ణయ్య అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసు వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోలింగ్ విధులు చేపట్టే పోలీసులు నిరంతరం కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండాలని, వాహనానికి జీపీఎస్ సిస్టమ్ కనెక్ట్ చేయబడి ఉందని చెప్పారు. ముందస్తు నేరాల కట్టడికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కంప్యూటర్ ఆధారంగా వాహన రూట్లను చెక్ చేస్తారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాన్ని ప్రతి రోజు శుభ్రపర్చాలని, కండీషనల్‌లో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫామ్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధిచిన మెకానిజం తెలుసుకుని ఉండాలన్నారు. సమావేశంలో ఐటీ కోర్ శ్రీనివాసులు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

‘నాణ్యమైన భోజనం అందించాలి’

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అడ్వకేట్ రాజు అన్నారు. గురువారం మండలంలోని కొల్పూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యకమంలో నాయకులు చంద్రశేఖర్, బుర్రి నర్సింహులు, శంకర్, మాల రాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సామాజిక అంశాలపై అవగాహన పోలీస్ కళాబృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగం, రోడ్డు భద్రతా నియమాలు, సమయపాలన, అమ్మాయిలు మహిళలపై వేధింపులు, లీడర్ షిప్ లక్షణాలు, లక్ష్య సాధనపై పోలీసులు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో డయల్ 100 కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

బీమా చెక్కు అందజేత

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నర్సింహ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తరపున రూ.2లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తల కోసం పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు వేపూరిరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ధన్వాడ: మండలంలోని ధన్వాడ, మరికల్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి మొదటి నుంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. గురువారం జిల్లా ఉన్నత అధికారుల ఆదేశానుసారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థుల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను వారి వారి తల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, గంగమ్మ, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించొద్దు

మద్దూరు: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను తరలించొద్దని యువకులు, వివిధ పార్టీల నాయకులు గురువారం గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఫోన్ చేసి వివరించారు. ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడారు. సోమవారం గురుకుల పాఠశాలలో పరిస్థితిని సమీక్షిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహా, నాయకులు సంజీవ్‌కుమార్, రహీం, హుసేన్ తదితరులు కలెక్టర్ ఏఓ నర్సింగ్‌రావ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలను తరలిస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో శంకర్, కార్యదర్శి సాయిలు, రాములు, నర్సింహ పాల్గొన్నారు.

ముందస్తుగా సంక్రాంతి వేడుకలు



నర్వ ఎస్‌వీఎం పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



మాగనూర్‌లో..



మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో..

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రేగిపల్ల పూజ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి మాట్లడుతూ.. సంక్రాతి పండుగ యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా విద్యార్థులతో కలిసి పతంగులు ఎగరవేసి ముగ్గులు వేశారు.

నర్వ: మండల కేంద్రంలోని ఎస్‌వీఎం పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో గంగిరెద్దులు, హరిదాసుల పాటలతో సంక్రాంతిని తలపించేటట్లు కార్యక్రమాలు చేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు రామన్‌గౌడ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు...

నారాయణపేట టౌన్: విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని శ్రీ సాయి స్కూల్ కమిటీ అధ్యక్షురాలు శేషమ్మ అన్నారు. గురువారం శ్రీ సాయి హై స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీలో మొదటి బహుతి సాధించిన దీక్షిత, ద్వితీయ బహుమతి అనూష, నందినికి తృతీయ బహుమతి అందించారు. కార్యక్రమలో పాఠశాల యాజమాన్యం సాయిలీల, సురేందర్, ప్రిన్సిపాల్ అభిలాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక సాయివిజయ్ కాలనీలోని కిడ్స్ హోం మాంటిస్సోరి స్కూల్ క్రీడా మైదానంలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పేపర్‌తో గాలి పటాలు తయారు చేయించి కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. ముగ్గుల పోటీ మొదటి బహుమతి రుశ్వత, రెండవ బహుమతి ఇషాన్వి సాధించారు. కైట్ ఫెస్టివల్ పోటీలో మొదటి బహుమతి కర్లి అజయ్‌కుమార్, రెండో బహుమతి శ్రేయస్ గెలుపొందాడు. విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ రజిని, ప్రిన్సిపాల్ వరలక్ష్మి బహుమతులు అందించి అభినందించారు.

కోస్గి: మండలంలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనంతప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. గాలి పటాలను తయారు చేసి వాటిపై పాఠ్యంశాలకు సంబంధించి పలు అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు వివేకానంద జయంతిని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మక్తల్: సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం మండలంలోని కాచ్‌వార్ ఎంపీయూపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు అనిత బహుమతుల ప్రదానం చేశారు. న్యాయవాది నరేందర్‌సాగర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నవీన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం సహించం

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: విధుల్లో అలసత్వం సహించమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీపీ వనజ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ముందుగా ప్రగతి నివేదికలను ఆయా శాఖ అధికారులు చదివి వినిపించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని ఖానాపూర్, కాచ్‌వార్ గ్రామాల్లో విద్యుత్ సమస్య అధికంగా ఉందని ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, సర్పంచు నర్సిములు వివరించారు. అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నార న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని, వైస్ ఎంపీపీ రామేశ్వరి, ఏఈలు లక్ష్మీనారాయణ, సత్యం, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఏఓ మితిన్‌చక్రవర్తి, ఐసీడీఎస్ అధికారి సరోజిని, సర్పంచు కుర్వ హన్మంతు, సర్పంచు దత్తు, తిమ్మప్ప, ఏపీఎం నారాయణ, కార్యదర్శి జగదీష్, ఎంపీటీసీలు ఇందిర, పారిజాత, సుజాత, సుమిత్ర, రాంలింగప్ప పాల్గొన్నారు.

ఊట్కూర్: ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారుల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. తిప్రాస్‌పల్లి సర్పంచ్ సుమంగళ, ఎంపీటీసీ హన్మంతు స్వామి , ఏఈ బాల్‌రాజ్, తహసీల్దార్ తిరుపతి, జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీడీఓ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓ విధులు తగదు



కలెక్టరేట్‌లో ఏఓకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నారాయణపేట టౌన్: అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓ విధులు అప్పగించొద్దని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ఏవో నర్సింగ్‌రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బీఎల్‌ఓ విధులను అప్పజెప్పడం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సేవలు అందించడంతో ఇబ్బందిగా మారుతుందని ఆవేదన వ్యక్త చేశారు. కార్యక్రమంలో ఊట్కూర్ మండల సీఐటీయూ నాయకులు బి.నారాయణ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటయ్య

మాగనూర్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏఓ హరిత, సూపర్‌వైజర్‌లు యాదమ్మ, మల్లేశ్వరమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో గురువారం కంటివెలుగుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాధవరెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కంటి వెలుగుపై ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సద్గుణ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి కంటివెలుగు ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, మాధవి, కడపన్న, సర్పంచు మాదవరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఎంపీపీ అధ్యక్షత మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్, ఎంపీటీసీలకు, కంటి వెలుగు కార్యక్రమంపై అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కోస్గి ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ అభివృద్ధి

ఆత్మకూర్: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని అవయవదానం ఫౌండేషన్ ఉమ్మడి రాష్ట్ర చైర్మన్ గుడూరు సీతామహాలక్ష్మి, తెలంగాణ ఇంచార్జీ గురుప్రకాష్ అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని జూనియర్‌కళాశాల ఆవరణలో వివేకనంద సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదానం, అవయదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, విండోఅధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, ఎస్ఐ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ దేశ పునర్నిర్మాణం కోసం యువకులు ముందుకు రావాలన్నారు. అనంతరం 35 మంది యువకులు రక్తదానం, 19 మంది అవయదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిఈడు పిల్లల గుర్తింపు



ధన్వాడ మండలం బుద్ధమర్రితండాలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ, ఉపాధ్యాయులు



నర్వ మండలం కొత్తపల్లిలో..

ధన్వాడ: మండలంలోని రాంకిష్టాయిపల్లి, బుద్ధమర్రితండాలలో గురువారం బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రాని బడిబయట పిల్లల వివరాలను సేకరించారు. ఈనెల 18వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని సీఆర్పీ వెంకట్రాములు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ మాసన్న, హెచ్ఎం బీమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, కొత్తపల్లి గ్రామాల్లో బడి బయటి పిల్లల సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా బడి బయటి విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం నర్సిములు, సీఆర్పీ నర్సిములు, ఐఈఆర్పీ రవి, హెచ్ఎం ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి, గురువలింగంపల్లి గ్రామాల్లో బడిఈడు పిల్లలపై ప్రత్యేక సర్వే చేపట్టారు. ఇంటింటికి తిరిగి బడిబయట పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఎల్లాగౌడ్, కృష్ణ, హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యానికి మేలు



రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ సభ్యులు

నారాయణపేట రూరల్: రక్తదానంతో ఆరోగ్యానికి మంచిదని భావ సమైక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య యాదవ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆ వేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 25 మంది యువకులు, మహిళలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనిషిలో రక్తం శుద్ధి అవుతుందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డీసీ ప్రిన్సిపాల్ రంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్‌బట్టడ్, రెడ్‌క్రాస్ కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, మహిళా ఎస్ఐ సుధామాధురి, నింగిరెడ్డి, ఆత్మారాం, సరాఫ్‌నాగరాజు, డాక్టర్ దినేష్, సమైక్య సభ్యులు వెంకటేష్, కృష్ణ, సతీష్, నందు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో...

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్‌గా స్రవంతి, డీఈఓగా సమ్రీన్‌బేగం, హెచ్ఎంగా నందినిలు వ్యవహరించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలో ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
శుక్రవారం। 13-1-2023

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...
* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్దిష్టమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్

● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.


● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

● గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.



■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియొనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియొనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

– 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

– దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదరగొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంటతడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

– బాలకృష్ణ


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్'' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్


● అభిరామ్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

– దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్